క్లుప్తంగా

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బీవీపీ శాశ్వత పథకమైన దివ్యాంగుల పునరావాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రమాదవ శాత్తు, దీర్ఘ రోగాలతో కాళ్లు పోగొట్టుకున్న, పోలియో దివ్యాంగులకు నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఇస్తామన్నారు. అవసరం ఉన్న వారు ఆగస్టు 5వ తేదీలోగా 90000 88660, 81425 50143 నెంబర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించే క్యాంప్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మెడికల్ నిపుణులతో పరీక్షలు నిర్వహించి కొలతలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

దేశ రక్షణలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బర్రెంకల నీలకంఠ

కర్నూలు కల్చరల్: దేశ రక్షణలో భాగస్వాములు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బర్రెంకల నీలకంఠ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్ ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఆదివారం జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణ జీవితంతో ముందుకు సాగుతూ సమాజ సేవలో పాలు పంచుకోవాలన్నారు బాబారాందేవ్ పతంజలి యోగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రభావరి ఎస్.వి. శివరాజ్, ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి, అన్ని ఉప బస్తీల కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు సమస్యలను పరిష్కరించాలి



సీతారాం నగర్ సెంటర్‌లో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(రూరల్): నగరంలోని 43,44 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు.ఆదివారం నగరంలోని సీతారాం నగర్ సెంటర్‌లో వార్డు కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ... సీతారాం నగర్‌లో కల్వర్ట్ నిర్మాణం పనులు మధ్యలో వదిలేయడంతో మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే కమిషనర్, మున్సిపల్ అధికారులు స్పందించి దుర్వాసన నుంచి కాలనీ వాసులకు విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గురు శేఖర్, హుస్సేన్, భాస్కర్, రోశయ్య పాల్గొన్నారు.

బాబు పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్) : జిల్లాలోని ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి పర్యటన వివరాలు తెలియజేశారు. ఆగస్టు 1వ తేదీ 11.30 గంటలకు నందికొట్కూర్‌లో రోడ్‌షో నిర్వహించి, 1.30 గంటలకు ముచ్చుమర్రి ప్రాజెక్టుకు చేరుకుంటారని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు బానకచర్ల నుంచి నంద్యాల మీదుగా కడప జిల్లా జమ్మలమడుగుకు బయలుదేరి వెళతారని చెప్పారు. సమావేశంలో నంద్యాల పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి, కె.ఇ. ప్రభాకర్, కోట్ల సుజాతమ్మ, మీనాక్షి నాయుడు, తిక్కారెడ్డి, జయనాగేశ్వర రెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో మూడో రోజు గణపతి పుణ్యాహావచనం, మంటపారాధన, కలశ స్థాపన, శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞం జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు.

పాతబస్తీలో కొత్త పైపులైన్!

- మురుగుకాల్వల్లో పైపులైన్లకు స్వస్తి
- 1 నుంచి 16 వార్డుల్లో నూతన పైపులైన్ వ్యవస్థ
- రూ. 2.25 కోట్లతో అంచనా
- త్వరలో పిలువనున్న టెండర్లు
- తీరనున్న దశాబ్దాల నాటి సమస్య



మురుగు కాల్వలో తాగునీటి పైపులు

కర్నూలు (టౌన్): నగరంలోని పాతబస్తీకి ఎంతో చరిత్ర ఉంది. ఏళ్లనాటి క్రితం ఏర్పడిన ఈ బస్తీలో మైనార్టీలు, పేదలు అత్యధికంగా నివసిస్తున్నారు. దాదాపు 1.50 లక్షల జనాభా ఉంటుంది. 1995 సంవత్సరంలో మున్సిపాల్టీ నుంచి కార్పొరేషన్‌కు కర్నూలు అప్‌గ్రేడ్ అయినా కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. గత పాలకులు వాటిని పట్టించుకోలేదు కూడా.దీంతో ఈ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందని పరిస్థితి. ఎందుకంటే దశాబ్దాల క్రితం మురుగుకాల్వల్లో నుంచి తాగునీటి పైపులు వేశారు. అవి పలు చోట్ల దెబ్బతిని నీరు లీకేజీ అవుతున్నాయి. ఫలితంగా తాగునీరు కలుషితమవుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఈ సమస్యను గుర్తించారు. వెనువెంటనే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి కొత్తపైపులైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

1 నుంచి 16 వార్డుల్లో నూతన పైపులైన్ వ్యవస్థ

పాతబస్తీలోని పలువార్డుల్లో పురాతన కాలం నాటి పైపులైన్ల స్థానంలో కొత్తపైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా 2 వ వార్డు ఖల్లా ఏరియా, 3 వ వార్డు పరిధిలోని బండిమెట్ట, గనిగల్లీ, 6 వ వార్డులోని గడ్డవీధి, బడీబీడ్, గరీబ్‌నగర్, 14 వ వార్డు పరిధిలోని బుధవారపేట, 16 వ వార్డులోని మరికొన్ని ప్రాంతాల్లో పైపులైన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినింది. దీన్ని పూర్తి స్థాయిలో తొలగించి 1 నుంచి 16 వార్డుల వరకు కొత్తగా పైపులైన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే చేపట్టాల్సిన పనులు, అవసరమయ్యే నిధులపై అంచనాలు రూపొందించడంతో ఏళ్లనాటి తమ సమస్యకు పరిష్కారం లభించనుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల వారీగా అంచనా వ్యయం

- 3 వ వార్డు బండిమెట్టలో రూ.53 లక్షలు
- 6 వ వార్డు గడ్డవీధిలో రూ. 35 లక్షలు
- 1 వ వార్డులో రూ.66. 50 లక్షలు
- 7 వార్డు నుంచి 13 వ వార్డు వరకు రూ.71 లక్షలు



పాతబస్తీలోని ఓ వీధిలో అస్తవ్యస్తంగా పైపులైన్ వ్యవస్థ

రూ.2.25 కోట్లతో పనులు

పాతబస్తీ ఏరియాలో పైపులైన్ సమస్యను గుర్తించాం. మురుగుకాలువల్లో పైపులు ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి16 వార్డుల వరకు ఈ సమస్య ఉంది. ఆయా ప్రాంతాల్లో రూ. 2.25 కోట్లతో యుద్ధప్రాతిపదికన కొత్తపైపులైన్ పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాం. త్వరలోనే టెండర్ నిర్వహించి 110 యంయం హెడీపీఈ పైపులైన్ నిర్మాణాలు చేపడతాం.

– మున్సిపల్ ఈఈ షాకీర్ హుస్సేన్

హిందువులు సంఘటితం కావాలి

కర్నూలు కల్చరల్: హిందువులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ అన్నారు. నగర శివారులోని విజ్ఞాన పీఠంలో జరిగిన రెండు రోజుల విశ్వహిందూ పరిషత్ అభ్యాస వర్గ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, నగర అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

2న సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(రూరల్): ఆగస్టు 2వ తేదీన నగరంలోని సీఆర్ భవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమాన్నికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, ఓబులేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు.

సాంఘిక నాటకాలను ఆదరించండి





జ్యోతి ప్రజ్వలనతో నాటకాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, అతీతం నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: సామాజిక సమస్యలకు ప్రతిరూపమైన సాంఘిక నాటకాలని ఆదరించాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఐఏఎస్, సీనియర్ కళాకారులు గుమ్మళ్ల బలరామయ్య, పడమటి గాలి నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు అన్నారు. నెల నెలా సాంఘిక నాటకాల్లో భాగంగా ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో 'అతీతం' అద్దెపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో 'థ్యాంక్స్ ఫర్ ది పీఎం' నాటకాలను ప్రదర్శించారు. ఈ నాటకాలు ప్రేక్షలను అలరించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కళాకారులకు కొదవ లేదన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటకాల దర్శకులు, రచయితలు, నటులను సన్మానించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా, సభ్యులు బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ మీటర్లను సకాలంలో జిల్లా కేంద్రానికి పంపని విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు సుమలత డిమాండ్ చేశారు. 'గొడెక్కని విద్యుత్ మీటర్లు' అనే శీర్షికన ఇటీవలే 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాన్ని స్పందించి అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్ల ఆదివారం స్థానిక 48వ వార్డు ప్రకాష్ నగర్‌లో మీటర్ల ప్లకార్డులు చూపుతూ నిరసన తెలిపారు. పాత మీటర్లను సకాలంలో ఎంఆర్‌టీ, స్టోర్స్‌కు పంపకుండా తమ కార్యాలయాల్లోనే కుప్పలు కుప్పలుగా, సంచుల్లో నింపి పెట్టడం సరైంది కాదని చెప్పారు. వీరి నిర్లక్ష్యం కారణంగా సంస్థ ఆదాయం కోల్పోవడంతో పాటు వినియోగదారులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజాధనానికి నష్టం చేకూర్చుతున్న ఏఈ, డీఈఈ, ఈఈలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానికులు శేశమ్మ, గోవిందమ్మ, గోరంట్లమ్మ, మునీర్, మబ్బాష తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అవసరం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆరోగ్య భారతి అభ్యాస వర్గ కార్యక్రమం బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వ్యక్తి, ఆరోగ్య కుటుంబం, ఆరోగ్య గ్రామం, ఆరోగ్య దేశం అనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అనంతరం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జీజీహెచ్ ఆయుర్వేద వైద్యశాల అధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. మన ఆరోగ్యం– గృహ వైద్యం గురించి విశ్రాంత టీబీ అధికారి డాక్టర్ పి.మోక్షేశ్వరుడు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎం. శ్రీధరశర్మ, డాక్టర్ కె.చంద్రోశేఖర్, సుబ్బారెడ్డి, నిర్మల, పి.ఎస్.రావు వివిధ రోగాలపై అవగాహన కల్పించారు. ఆర్యోగ భారతి ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎం.డి.వి.ఎస్.రామశర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారతి మహిళా కార్యదర్శి స్వప్న పార్థసారథి, ఆరోగ్య భారతి సభ్యులు పాల్గొన్నారు.



భరతమాత చిత్ర పటం వద్ద ఆరోగ్య భారతి ప్రతినిధులు, అతిథులు

9న క్విట్ మోడీ - సేవ్ ఇండియా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

కర్నూలు(రూరల్): ఈ నెల 9వ తేదీన క్విట్ మోడీ - సేవ్ ఇండియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు తెలిపారు. ఆదివారం నగరంలోని కే కే భవనంలో ఆ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. ప్రధాన మోదీ నిత్యవసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ఆయనను గద్దెదించడానికి కార్మిక సంఘాలు కలిసికట్టుగా ఉద్యమాలకు సిద్ధం కావలన్నారు. మోడీని సాగనంపండి – దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల 9 తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే క్విట్ మోడీ – సేవ్ ఇండియా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గౌస్ దేశాయ్, నిర్మల, నాగేశ్వరమ్మ, ఈరన్న పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామ కృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. తర్వాత హరే రామ హరే కృష్ణ సంకీర్తన ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

కర్నూలు కల్చరల్: త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక్ ఘాట్, స్వామిరెడ్డి నగర్‌లలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేషు, వెంకటేశ్వర్లు, ఓబులేష్, అనిల్, ఈశ్వరయ్య, ప్రబోధ, సునీత, లత, లక్ష్మీదేవి, చరణ్, అక్షిత్, మౌనిక, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఇంటిముంగిటకే సేవలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటిముంగిటే అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమ్మరిగేరి వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధుడు సుబ్బారావు మాట్లాడుతూ గతంలో పింఛన్ కోసం తాను ఎన్నో ఇబ్బందులు పడ్డానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే పింఛన్ వస్తుందని సంతోషం వ్యక్తం చేశాడు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అవ్వా తాతలకు ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసుకుంటున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల ద్వారా పింఛన్ పంపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషుయాదవ్, అక్బర్ అలీ, మహబూబ్ బాషా, ఖాదర్, మసూద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

– వచ్చు ప్రచారాన్ని జనం నమ్మరు

తమ ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు చేసే విష ప్రచారాన్ని జనం నమ్మరని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. కుమ్మరిగేరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు టీడీపీ నేతలు తనపై చేస్తున్న తప్పుడు ప్రచారం కొత్తేమి కాదన్నారు. కరోనా సమయంలో దుష్ప్రచారం, లోకేష్ పాదయాత్ర సమయంలో భూ కబ్జా ప్రచారం చేశారన్నారు. తాజాగా తనపై బురద జల్లేందుకు ఓ మహిళలను అడ్డుపెట్టుకున్నారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం వారు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

స్పోర్ట్స్

విజేతలకు సన్మానం

కర్నూలు(రూరల్): నగరంలోని కిడ్ వరల్డ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన పార్థసారథి నగర్‌కు చెందిన విద్యార్థులను కాలనీ వాసులు సన్మానించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ పార్క్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కాలనీ వాసులు మాట్లాడుతూ... ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మోహన్, శ్రీనివాసులు, ముర్తుజా వలీ, షేర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు(రూరల్): నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం కర్నూలు జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్‌జట్టును ఎంపిక చేశారు. కోచ్ బ్రహ్మ ఆధ్వర్యంలో పది రోజులు శిక్షణ ఇచ్చి తుది జట్టును ప్రకటిస్తామని ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రముఖ గాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. ఆదివారం నగరంలోని సీఆర్ భవనంలో శిక్షకుడు షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ షబ్బీర్ హుస్సేన్, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, చిట్టిబాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో సీనియర్ టీచర్లకు న్యాయం చేయాలి

కర్నూలు సిటీ: విద్యాశాఖలో జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని నాట్ విల్లింగ్ ఇచ్చిన సీనియర్ ఎస్జీటీ టీచర్లు కోరారు. ఆదివారం నగరంలోని ఓ కాలేజీలో నాట్ విల్లింగ్ ఇచ్చిన టీచర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది అక్టోబరు నెలలో పని సర్దుబాటు కింద పదోన్నతులు ఇచ్చారని, ఇందులో 1996 నుంచి 2003 డీఎస్సీ వరకు చాలా మంది సీనియర్ టీచర్లు విల్లింగ్ ఇచ్చి 100 నుంచి 150 కి.మీ దూరంలోని స్కూళ్లలో పని చేశామన్నారు. చివరికి ఇవి పదోన్నతులు కాదని రద్దు చేశారని, దీని వల్ల తాము నిరాశ చెందామని, అయితే ఈ ఏడాది మే నెలలో ఇచ్చిన పదోన్నతుల సమయంలో పదోన్నతులకు ఇష్టం లేని వాళ్లు ఉంటే నాట్ విల్లింగ్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సూచించారన్నారు. గతేడాది పని సర్దుబాటు పేరుతో ఇచ్చిన పదోన్నతులు రద్దు చేయడంతో మే నెలలోని పదోన్నతులను నమ్మలేక దాదాపు సీనియర్ టీచర్లలో 80 శాతం మంది నాట్ విల్లింగ్ ఇచ్చామన్నారు. దీంతో తాము పదోన్నతులకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, ఎస్జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పూజారి లక్ష్మయ్య సంఘీభావం తెలిపారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న కోరారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన నిర్వహించిన మొదటి కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో వై నాట్ ఓపీఎస్ పేరుతో ఉమ్మడి ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ కాకుండా మధ్యంతర భృతి 50 శాతం ప్రకటించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో జారీ చేసిన జీఓ 117ను రద్దు చేయాలని, ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు జనార్దన్, నాగరాజు, బసవరాజు, మహమ్మద్ షఫీ, సయ్యద్ ముదిసిర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

- కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ విజయమనోహరి



కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ విజయ మనోహరిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సేవలు ప్రశంసనీయమని కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లయన్స్ జిల్లా గవర్నర్ లయన్ నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 204 దేశాల్లో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 24 క్లబ్స్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ లయన్ దుర్గా నాగేశ్వరరావు మాట్లాడుతూ 1వ తేదీ నుంచి నూతన లయన్సిక్ సంవత్సరం మొదలవుతుందన్నారు. అనంతరం కేడీసీసీబీ ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఇండక్షన్ ఆఫీసర్‌గా క్లబ్ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధనగిరి, ఉపాధ్యక్షులుగా శారదమ్మ, కోశాధికారిగా అనూష, జాయింట్ సెక్రటరీగా డాక్టర రమేష్, గౌరవాధ్యక్షుడిగా మహబుబ్ బాష తదితరులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ.విజయకుమార్, కోశాధికారి రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ ఛైర్‌పర్సన్‌కు ఘన సన్మానం

కర్నూలు(రాజ్‌విహార్): కేడీసీసీ బ్యాంక్ ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరికి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డికి 48వ వార్డు కార్పొరేటర్ మల్లికా బేగం, పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు మంచి జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఖాలిద్, గౌస్‌బాషా, రహమాన్, కర్నూలు, నంద్యాల జిల్లాల కల్చరల్ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంలకు ఇతర శాఖల బాధ్యతలొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వైద్య ఆరోగ్యశాఖ విధులు తప్ప ఇతర ఎలాంటి విధులు అప్పగించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు సి.క్యాంపు సెంటరులో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఫంక్షన్ హాల్‌లో ఏపీ మెడికల్ ఫెడరేషన్ నిర్వహించిన సమావేశానికి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంగళరెడ్డి మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఇతర శాఖల పనులు కూడా అప్పగిస్తుండటం వల్ల పని ఒత్తిడి అధికమైందని, 40 యాప్‌లను ప్రతి రోజు అప్‌డేట్ చేయాల్సి ఉందని తెలిపారు. వైద్యారోగ్యశాఖకు చెందిన మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆ శాఖకు సంబంధించిన పనులు మాత్రమే నిర్వహించే అవకాశం కల్పిస్తే సేవల్లో నాణ్యత పెరుగుతుందని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎన్జీఓ నేతలు జవహర్‌లాల్, దస్తగిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఏపీ మెడికల్ ఫెడరేషన్ ఛైర్మన్ ఈశ్వరయ్య, కన్వీనర్ చందన, కోశాధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.